www.aknu.edu.in
nannayavani@aknu.edu.in
nannayanewstv
Adikavi Nannaya University
9701293231

విశ్వవిద్యాలయ స్థాయి తొలి తెలుగు వార పత్రిక

# నన్నయ వాణి

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

గౌరవ సంపాదకులు
ఆచార్య మొక్కా జగన్నాథరావు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కుల సచివులు

సంపాదకులు
డా.తలారి వాసు, సహాయాచార్య, తెలుగు శాఖ
పువ్వల ఆనంద్, ప్రజా సంబంధాల అధికారి, కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 2 | సంచిక : 10 | 13-12-2021 | పుటలు : 4


# చైతన్య కార్యక్రమాలతో విజ్ఞానాన్ని పెంచాలి



**07.12.21 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలోని అన్ని విభాగాలు చైతన్యవంతమైన కార్యక్రమాలతో విద్యార్థుల విజ్ఞానాన్ని పెంచాలని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ,ఇంజనీరింగ్ లోని మంగళవారం “డిపార్టమెంటల్ వైబ్రెంట్ యాక్టివిటీ”ని వీసీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ డిపార్ట్మెంటల్ వైబ్రెంట్ యాక్టివిటీలో భాగంగా సైన్స్ అండ్ టెక్నాలజీ, ఇంజనీరింగ్ కళాశాలలోని అన్ని విభాగాల వద్ద పోస్టర్స్ ను ప్రదర్శిస్తున్నామన్నారు. విశ్వవిద్యాలయంలోని అన్ని విభాగాలను చైతన్యవంతం చేస్తూ విద్యార్థులకు విజ్ఞానాన్ని అందించాలనే ఉద్దేశంతో పోస్టర్స్ ను ఏర్పాటు చేసామన్నారు. ఒక పాఠ్యాంశాన్ని విద్యార్థులకు అర్థమయ్యే విధంగా ఒక చిత్రం రూపంలో ప్రదర్శించడం ద్వారా ఎక్కువ కాలం దానిలోని సారాంశం గుర్తుంటుందన్నారు. ఆయా విభాగాల ప్రత్యేకతలు, శాస్త్రీయ, సాంకేతిక పరిజ్ఞాన అంశాలన్నీ ఈ పోస్టర్స్ ద్వారా ప్రదర్శింపబడుతున్నాయన్నారు. విద్యార్థులు, అధ్యాపకులు, సందర్శకులకు ఆయా విభాగాల ప్రత్యేకతలు ఔన్నత్యాలు ఈ పోస్టర్స్ ద్వారా తెలుస్తాయన్నారు. ప్రస్తుతం సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలకు చెందిన 278 పోస్టర్లు, ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన 122 పోస్టర్లును ప్రదర్శించామన్నారు. విద్యార్థుల భాగస్వామ్యంతో అధ్యాపకులు మరిన్ని వినూత్న విజ్ఞాన కార్యక్రమాలను నిర్వహించాలని తెలియజేసారు. విద్యార్థులకు గురువులు చక్కని మార్గనిర్దేశం చేయాలని వారి ఉన్నతికి దోహదపడాలని అధ్యాపకులకు సూచించారు. చక్కని పోస్టర్స్ ను ఏర్పాటు చేసిన జియోలజీ విభాగాధ్యాపకులు డా.పీటర్ ను వీసీ అభినందించారు. విభాగాల వద్ద ఏర్పాటు చేసిన పోస్టర్స్ వివరాలను విద్యార్థులనడిగి తెలిసుకొని వారితో మమేకమయ్యారు. ఈ కార్యక్రమంలో ఈసీ మెంబర్ డా.బి.జగన్మోహనరెడ్డి, ప్రిన్సిపాల్స్ డా.కె.రమణేశ్వరి, డా.వి.పెర్సిస్, డా.ఎం.కమలకుమారి తదితరులు పాల్గొన్నారు.




# క్రీడాభివృద్ధికి సంపూర్ణ సహకారం




క్రీడలను పోత్సహిస్తున్న వీసీ ని సన్మానిస్తున్న అధికారులు

**09.12.21 (మీడియాసెల్)** క్రీడాభివృద్ధికి సంపూర్ణ సహకారాన్ని అందిస్తామని, క్రీడాకారులకు విశ్వవిద్యాలయం ప్రోత్సాహాన్ని అందిస్తుందని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీలో గురువారం యోగా మెన్ అండ్ ఉమెన్, క్రికెట్ ఉమెన్ కు ఇంటర్ కాలేజియట్ అండ్ యూనివర్సిటీ టీమ్ సెలక్షన్స్ ను నిర్వహించారు. వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు ముఖ్యఅతిథిగా హాజరై విశ్వవిద్యాలయ జట్టు ఎంపిక ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఉభయగోదావరి జిల్లాల్లోని నన్నయ యూనివర్సిటీ పరిధిలో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తరుపున ఆయా క్రీడల్లో ప్రతిభను కనపరచి మొదటి నాలుగు స్థానాలు కైవసం చేసుకున్న వారికి విశ్వవిద్యాలయం తరపున నగదు బహుమతిని అందిస్తామన్నారు. క్రీడాభివృద్ధికి కళాశాలలు పూర్తి సహకారాన్ని అందించాలని క్రీడాకారులపై ప్రత్యేక దృష్టిని సారించాలని వారిని ప్రోత్సహించాలని తెలియజేసారు. క్రీడల్లోపాల్గొన్న విద్యార్థులకు మార్కులు,హాజరులో మినహాయింపు ఇస్తామన్నారు. క్రీడలకు హాజరైన సందర్భంలో పరీక్షలు వ్రాయలేని విద్యార్థులకు ఉచితంగా రీఎగ్జామ్స్ నిర్వహిస్తామన్నారు. క్రీడాకారులకు అన్ని వసతులు కల్పిస్తామని వారి ఆరోగ్య భద్రతపై హెల్త్ ఇన్సూరెన్స్ చేయించాలని చెప్పారు. క్రీడాకారులకు అందించాల్సిన వసతులను సకాలంలో అందించాలని ఫిజికల్ డైరెక్టర్లకు సూచించారు. క్రీడాభివృద్ధితో పాటు క్రీడాకారుల సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ వహించిన వీసీకి క్రీడాకారులు కరతాళ ధ్వనులతో అభినందనలు తెలియజేసారు. విశ్వవిద్యాలయ క్రీడావిభాగం నుండి వీసీ అభినందించి సన్మానించారు. తరువాత యోగా మెన్ అండ్ ఉమెన్ ఎంపికలను నిర్వహించి ఆరుగురు పురుషులను, ఆరుగురు మహిళలను విశ్వవిద్యాలయం జట్టుగా ఎంపిక చేసారు. ఈ నెల 25 నుండి 28వ తేదీ వరకూ కె.ఐ.ఐ.టి యూనివర్సిటీ భువనేశ్వర్ లో జరిగే టోర్నమెంట్ లో నన్నయ జట్టు పాల్గొంటారు. అలాగే క్రికెట్ ఉమెన్ పదహారు మందిని విశ్వవిద్యాలయ జట్టుగా ఎంపిక చేసి మద్రాసులోని సత్యభామ యూనివర్సిటీ పోటీలకు పంపుతున్నారు. ఆయా స్థాయిలలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం జట్టు ప్రతిభను కనపరచాలని వీసీ మరియు విశ్వవిద్యాలయ అధికారులు శుభాకాంక్షలను తెలియజేసారు. ఈ కార్యక్రమంలో సభ్యాధ్యక్షులు డా.డి.కల్యాణి, స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ డా.బి.రామగోపాల్, ప్రిన్సిపాల్స్ ఆచార్య ఎస్.టేకి, డా.కె.సుబ్బారావు, క్రీడానిర్వాహకులు డా.కె.బాలసత్యనారాయణ, వి.ఎస్.దేవానంద్, పీడీలు మూర్తి, సుబ్రహ్మణ్యం, శ్యామ్ సుందర్, ఆయా కళాశాలల పీడీలు, క్రీడాకారులు, ఎంపిఈడీ విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉపకులపతి ఉవాచ



## విద్యార్థి మిత్రులారా!

మనదేశ జనాభాలో సగం పైనే మీరున్నారు. మీరు మన దేశానికి చాలా గొప్ప వనరు. మీ శక్తిని సరైన పద్ధతిలో ఉపయోగిస్తే దేశప్రగతికి మీరు ఒక గొప్ప అవకాశం అవుతారు.మీ యువశక్తిలో నవనవోత్తేజం ప్రవహించి నవీన మార్పులు సృష్టించగలిగే స్ఫూర్తి, సమాజానికి సరికొత్త వెలుగులు ప్రసరించే దీప్తి మీలోఉంది. కాలాన్ని సద్వినియోగం చేసుకుని ఉజ్వల భవిష్యత్తుగా మార్చుకునే బాధ్యత మీకుంది. మీరు ఈ దేశానికి ఇంధనం. ప్రగతిరథ ముందుచక్రం. చరిత్రలో ఏ మార్పు సంభవించినా అది ఉరకలెత్తే మీ వల్లనే సాధ్యమవుతుంది. క్షణక్షణం దేశం కోసం పరితపించిన యువతవల్లనే మనకు స్వాతంత్ర్యం లభించింది. వారే కోట్లాది మంది ప్రజల గుండెల్లో నిలిచారు.ఇవాళ ప్రశ్నించే ప్రతి పిడికిలి,గొంతు వెనుక వారి స్ఫూర్తి ధ్వనిస్తుంది.

ఒక దశ నుంచి సమాజం మరొక దశకు మారుతున్న క్రమంలో సాంకేతిక ప్రగతి చాలా కీలకమైంది. సాంకేతిక సాకర్యాలన సద్వినియోగంతో మీ విజ్ఞానాన్ని నిరంతరం పెంచుకుంటూ, నిజాయితీగల, విలువలతో నిండిన మనుషులుగా మీరు ఏ రంగంలో ఉన్న ఆ వ్యవస్థకు,సమాజ ప్రగతికి తోడ్పడే వ్యక్తులుగా స్వీయ క్రమశిక్షణతో ముందుకు సాగాలని నేను కోరుకుంటున్నాను.

మొక్కా జగన్నాథరావు

## సంపాదకీయం



# నిజమైన విద్య

విద్య వలన, శ్రద్ధ వలన కలిగే ఫలితం అత్యంత శక్తిమంతంగా ఉంటుందని అంటుంది మన భారతీయ సాహిత్యం. కళాశాలలలో, విశ్వవిద్యాలయాల్లో చదువులు పూర్తి చేసుకుని బయటకు అడుగు పెడుతున్న ప్రతి విద్యార్థినీ ఆహ్వానించడానికి సిద్ధంగా ఉన్న మన సమాజం పెరుగుతున్న సమస్యలతో, ప్రభావవంతమైన చరిత్రతో, గొప్ప భవిష్యత్తుతో ఉంది. ప్రతి విద్యార్థి తనను తాను శక్తిమంతం చేసుకుంటూ, సమాజాన్ని శక్తిమంతం చేయడానికి ప్రయత్నించే దిశగా దినచర్యను తయారు చేసుకోవలసిన అవసరం ఉంది. ఆత్మవిశ్వాసం వలనా, మన దేశ వారసత్వం మీద నమ్మకం వలనా, ప్రస్తుతం అందుబాటులో ఉన్న విజ్ఞానంతో మమేకం అవటం వలన మాత్రమే విద్యార్థులకు అటువంటి శక్తి లభిస్తుంది. నిజమైన విద్య లక్ష్యం కూడా ఇదే.


'ఎంత వరకూ జీవిస్తానో, అంతవరకూ నేర్చుకుంటూనే ఉంటానన్నారు' రామకృష్ణ పరమహంస. ఇటువంటి అభిప్రాయం విద్యార్థుల్లో నిరంతర వ్యక్తిత్వ వికాసానికి, ప్రవర్తనలో అభివృద్ధికి, జీవించటంలో మెరుగుదలకు కారణమవుతుంది. చదువులు మెదడులో కూరడానికి కాదు. మనసుకి శిక్షణ ఇవ్వటానికి. గ్రేడ్లు, ర్యాంకులతో విజయ కేతనాన్ని ఎగురవేస్తున్న చాలామందిలో సృజనాత్మకశక్తి లేకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది.బహుశా మాస్టారు నోట్స్ లో నుండి విద్యార్థుల నోట్స్ లోకి, మొబైల్ నుండి మొబైల్ కి సమాచారాన్ని చేరవేసే ప్రక్రియ వలన ఈ ఇబ్బంది వచ్చివుండొచ్చు. ప్రాచీన భారతీయ విద్యావిధానంలోని మాస్టారి మెదడు నుండి, బుద్ధి నుండి విద్యార్థుల మెదటిలోకి,బుద్ధిలోకి ప్రవేశించే చదువులకు ప్రాధాన్యం తగ్గటం మూలాన్న అయ్యుంటుంది.

జీవితాన్ని నిర్మించే, మానవుణ్ణి నిర్మించే, ప్రవర్తనను నిర్మించే భావాల సమీకరణం మాత్రమే విద్య అంటారు వివేకానందులు. చదువులకు సంబంధించిన పుస్తకానికి గాంధీజీ ముందుమాట రాస్తూ జీవితంపట్ల తమనుతాము సన్నద్ధం చేసుకోవటానికి తోడ్పడలేనిది,దృఢమైన వ్యక్తిత్వాన్ని వ్యక్తం చేయలేనిది, సమర్పణ భావాన్ని ఇవ్వలేనిది విద్య ఎలా అవుతుంది? అని ప్రశ్నించారు. దీనికి సమాధానంగా టాగోర్ గురుదేవుని అనురాగపూరిత వాక్యాన్ని మనం ఒకసారి స్మరించుకోవాలి. "విద్య లక్ష్యం – మనిషికి సత్య సమైక్యతను ఇవ్వటమే"

తాత్కాలికమైన భౌతిక ప్రయోజనాలు, వినోదాలు,కాలక్షేపాలు, వంటివాటిల్లో మునిగిపోకుండా ఉన్నతమైన విలువల్లోకి, సంభాషణల్లోకి,ప్రవర్తనలోకి, తమకు తాముగా, పదిమందికి ఉపయోగపడే వ్యక్తులుగా మన విద్యార్థులు తయారుకాగలిగితే, చేయగలిగితే, అటువంటి చదువుల్ని అందించగలిగితే,వారు గ్రహించగలిగితే ఈ సాంకేతిక అభివృద్ధి, సౌకర్యాల కల్పన,తపన పడుతున్న వ్యక్తుల శ్రమ, ఖర్చు,సమయం నిజమైన విద్య కోసం సద్వినియోగమవుతున్నట్లే!

# మనిషి

## పుస్తకం




ఈ పుస్తకం ప్రధానంగా 'మనిషి' ని నిర్వచించింది. ప్రకృతిలో భాగమైన ఓ జీవి కాలక్రమంలో నరరూపం దాల్చేందుకు దారితీసిన పరిస్థితులను వివరించింది. ఇతర జీవులకీ, మనిషికీ మధ్య తేడా ఏమిటో తెలుసుకునే అవకాశం కల్పించింది. చరిత్రను ఎక్కడ నుంచి ప్రారంభమయ్యింది, ఏ ప్రాతిపదికన ఆ చరిత్ర నిర్మితమైంది, నిర్మితమైన చరిత్రను ఏ దృష్టికోణం నుంచి చూడాలో సూచన చేసింది. గుణాత్మకమైన మార్పును ఎలా గుర్తించవచ్చో అవగాహన చేస్తుంది.

ప్రధానంగా చైతన్యం అంటే ఏమిటి, అది మనిషిలో ఎలా కలుగుతుందో సవివరంగా తెలియజేసింది. ఈ మొత్తం క్రమంలో మనిషికీ, ప్రకృతికీ గల సంబంధాలు ఎటువంటి రూపం తీసుకుంటాయో అన్న అంశం ఆసక్తిని కలిగించింది. జీవక్రియలాంటి ఓ శ్రమ క్రమానుగతంగా స్వేచ్ఛాయుత స్థానం నుంచి బందీగా మారిన స్థితిగతులను విశదీకరించింది.

"చైతన్యానికీ, ఆలోచనకు ముడిసరుకు ఇంద్రియ జ్ఞానమ"న్న విషయం ఎంతగానో ఆకర్షించింది. అమూర్త భావాలు ఎలా పుట్టుకుని వచ్చాయో వివరించే ప్రయత్నం చేసింది. ఐడియాలిజీని మరోసారి ఈ పుస్తకం తడిమింది. ప్రాక్సిస్ అంటే ఏమిటి? అదెలా ? అన్న వివరణ కొత్త ఆలోచనను రేకెత్తించింది. మనిషికి మనిషే ఓ వస్తువుగా పరిగణించడం ఈ వ్యవస్థ సాధించిన గుణాత్మకమైన మార్పు అన్న విషయాన్ని గమనించేటట్లు చేసింది. అస్తిత్వానికి ఓ విస్తృతార్ధాన్ని అందించింది. ఆర్థికమే పునాది అన్నది శాశ్వతమా? తాత్కాలికమా? అన్న అంశాన్ని సూత్ర ప్రాతిపదికన తాత్కాలికమేనని నిరూపించింది. మనిషికి అవసరం లేని వస్తువులను రుద్దుతున్నారని గగ్గోలు పెట్టే జీవులకి ఓ పేరా కనువిప్పు కలిగించగలిగింది.

'ఆస్తి స్వేచ్ఛ' 'ఆస్తి నుండి స్వేచ్ఛ' గా మారాలన్న ఆకాంక్షను వ్యక్తం చేసింది. ఈ ఆకాంక్షను చేరుకునే క్రమంలో కార్మికవర్గ నియంతృత్వం ఎలా అవసరం పడుతుందో,దాని నిజ లక్ష్యం ఏమిటోతెలియజేసింది.

సంపన్న మానవుడు అంటే సంపదను పోగేసుకునేవానిగా చెప్పే వాళ్లకి చెంప చెళ్లుమనిపించే వివరణను ఇచ్చింది. "మనిషిలో ఇంకా అతనికే తెలియని అనేకానేక శక్తులు అంతర్గతంగా నిద్రాణ స్థితిలో ఉన్నాయనీ, వాటన్నింటినీ వెలికితీసి వ్యక్తం చేసే అవకాశాలను కల్పించే సామాజిక వ్యవస్థను మనిషి నిర్మించుకోవాలన్నది మార్క్స్ కోరిక. మనిషి తన శక్తులను పూర్తిగా తన ఆధీనంలోకి తెచ్చుకున్నప్పుడే నిజమైన మానవ చరిత్ర మొదలవుతుందని మార్క్స్ అభిప్రాయం. అప్పటివరకూ నడుస్తున్న చరిత్రను ఆయన 'మానవ పూర్వ చరిత్ర'అంటాడు.

అంటే మనం జీవిస్తున్న ఈ కాలం మానవ పూర్వ చరిత్ర కిందకే వస్తుందన్న వాస్తవం కళ్లు తెరిపించింది.

– పురిటి లక్ష్మణరావు

# నన్నయ విద్యార్థులకు పరిశోధనల్లో ప్రోత్సాహం



విద్యార్థులకు ఈ-రిసోర్సస్ అకౌంట్ లను ప్రారంభిస్తున్న వీసీ

**10.12.21 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ విద్యార్థులంతా పరిశోధన లలో రాణించాలని, పరిశోధన లకు అవసరమైన వనరులను అందించి విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. యూనివర్సిటీ ఈసీ హాల్ లో శుక్రవారం జెస్టోర్, జెగేట్ సేవలను అన్ని విభాగ విద్యార్థులకు అందించే కార్యక్రమాన్ని నిర్వహించారు. రాజమహేంద్రవరం, కాకినాడ, తాడేపల్లిగూడెం క్యాంపస్ ల నుండి అన్ని విభాగాల నుండి కోర్సు కోఆర్డినేటర్లు, సీఆర్ లు హాజరయ్యారు. వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు ఆయా విభాగాల అధ్యాప కులకు, విద్యార్థులకు జెస్టోర్, జెగేట్ ఈ-రిసోర్సస్ ఐడి, పాస్వర్డ్ లను అందించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రాజమహేంద్రవరం, కాకినాడ, తాడేపల్లిగూడెం క్యాంపస్ లలోని అందరి విద్యార్థులకు ఈ-రిసోర్సస్ జెస్టోర్, జెగేట్ సౌకర్యాన్ని కల్పించామన్నారు. ఈ-రిసోర్సస్ జెస్టోర్, జెగేట్ సౌకర్యాలను గత ఏడాది కాలంగా అధ్యాపకులకు, పరిశోధకులకు అందించామని వాటి సేవలను విస్తరిస్తూ విశ్వవిద్యాలయ మూడు ప్రాంగణాల విద్యార్థులకు అందిస్తున్నామని అన్నారు. జెస్టోర్, జెగేట్ వంటి ఈ-రిసోర్సస్ లో అపారమైన విజ్ఞాన సంపద ఉందని దానిని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ-జర్నల్, ఈ-బుక్స్, ఆడియో విజ్యువల్స్ వంటి అన్ని రూపాలలో విద్య, విజ్ఞాన సంపద అందుబాటులో ఉంటుందన్నారు. ఈ-రిసోర్సస్ ను సమర్ధవంతంగా ఉపయో గించుకొని పరిశోధనలలో రాణించాలని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని తెలియజేసారు. లైబ్రరీ అఫైర్స్ కోఆర్డినేటర్ డా.కె.రమణేశ్వరి మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రాజమహేంద్రవరం, కాకినాడ, తాడేపల్లిగూడెం క్యాంపస్ లలో విద్యార్థులందరికీ జెస్టోర్, జెగేట్ సౌకర్యాన్ని కల్పించడం చాలా మంచి నిర్ణయమని వీసీ ని అభినందించారు. విద్యార్థులకు అవసరమైన విజ్ఞానాన్ని అందిస్తూ వారిని పరిశోధనలవైపు నడిపించడానికి ఈ-రిసోర్సస్ చక్కని అవకాశాలన్నారు అభివృద్ధి చెందుతున్న ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో విద్యార్థుల పరిశోధన ప్రగతికి పెద్దపీత వేయడం హర్షణీయమని దీనిని విద్యారు ధులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ప్రిన్సిపాల్స్ ఆచార్య ఎస్.టేకి, డా.కె.రమణేశ్వరి, డా.వి.పెర్సిస్, డీన్స్ డా.ఎ.మట్టారెడ్డి, డా.పి.వెంకటేశ్వరరావు, లైబ్రేరియన్ డా.టి.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

# డిగ్రీ గణితశాస్త్ర పాఠ్య గ్రంథం ఆవిష్కరణ



డిఫ్రన్షియల్ ఇక్వేషన్స్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ


**10.12.21 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ డిగ్రీ మొదటి సెమిస్టర్ విద్యార్థులకు ఉపయోగపడే విధంగా "డిఫ్రన్షియల్ ఇక్వేషన్స్ (%ణఱటటవతీవఅఋఱశ్రీ జునఖఅశీఅం%)" అనే గణితశాస్త్ర పాఠ్య పుస్తకాన్ని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు విడుదల చేసారు. శుక్రవారం యూనివర్సిటీ ఈసీ హాల్ లో పుస్తకాన్ని ఆవిష్కరించిన వీసీ వివరాలను తెలియజేసారు.డిఫ్రన్షియల్ ఇక్వేషన్స్ అనే గణితశాస్త్ర పాఠ్య పుస్తకాన్ని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ విభాగాధ్యాపకులు డా.జి.వెంకట్రూరావు, రాజమండ్రి ఆర్ట్స్ కాలేజ్ అధ్యాపకులు డా.కె.నవీన్ కుమార్, గైట్ డిగ్రీ కాలేజ్ అధ్యాపకులు వై.విజయశ్రీ రచించారని అన్నారు. శ్రీ పబ్లికేషన్స్ విశాఖపట్నం ఈ పుస్తకాన్ని ప్రచురించారని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ మొదటి సెమిస్టర్ విద్యార్థులకు సులభమైన పద్ధతిలో గణితశాస్త్ర పాఠ్యాంశాలు ఈ పుస్తకం ద్వారా అర్థమవుతాయని తెలిపారు. అవకలన సమీకరణలకు సంబంధించిన అన్ని అంశాలను, పోటీ పరీక్షలకు సంబంధించిన ప్రశ్నలను ఈ పుస్తకంలో పొందుపరిచారన్నారు. ఉభయగోదావరి జిల్లాల్లోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలో అధ్యాపకులు ఆయా పాఠ్యాంశాలపై నాణ్యమైన పుస్తకాలను రచించేందుకు కృషి చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ప్రిన్సిపాల్స్ ఎస్.టేకి, డా.వి.పెర్సిస్, డా.కె.రమణేశ్వరి, సీడీసీ డీన్ డా.పి.వెంకటేశ్వరరావు, కోర్సుకోఆర్డినేటర్ ఎం.బాలకృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.




## ప్రతిభా వాణి

# విలియం షేక్స్ పియర్

(1564 -1616)



షేక్స్పియర్ ఆంగ్లావనిలో ఉద్భవించిన మహాకవి. ఉత్తమ నాటక కర్త.ఆయన నాటకాలు అద్వితీయమైన రంగస్థల విజయాన్ని సాధించాయి. వివిధ వర్గాలకు చెందిన ప్రేక్షకుల మన్ననలను సంపాదించాయి.

హెన్రి,కామెడీ ఆఫ్ ఎర్రర్స్,మిడ్ సమ్మర్ నైట్స్ డ్రీమ్, మర్చంట్ ఆఫ్ వెనిస్, జూలియట్ సీజర్,యాజ్ యు లైక్ ఇట్, హామ్లెట్,ఒథెల్లో, మాక్ బెత్, ఆంటోనీ అండ్ క్లియోపాత్రా, డి టెంపెస్ట్.... ఇలా షేక్స్పియర్ 37 నాటకాలను రచించారు.ఒక్కొక్క నాటకం ఒక విశిష్ట కళాసృష్టి. షేక్స్పియర్ నాటక విమర్శ ఈనాటికీ నిరంతరం కొనసాగుతూనే ఉంది. ఆయన సాహిత్యం గురించిన విస్తృతమైన విమర్శనా సాహిత్యం ఆంగ్లంలో అపారంగా ఉంది. షేక్స్పియర్ ది సహజ ప్రతిభ. దినదిన ప్రవర్ధమానమైన రంగస్థల అనుభవం తప్ప ఆయనకు మరే పాండిత్యం లేదు. ఆయన సర్వతోముఖ ప్రతిభతో సుఖాంత, విషాదాంత చారిత్రక నాటకాలను ప్రశంసనీయంగా రచింపగలిగారు. కథా వస్తువులకు అనుగుణంగా తన ప్రతిభా విశేషాలు ప్రదర్శించారు. వివిధ కళా వస్తువులను వివిధ మార్గాలలో చిత్రింపగలిగారు. విషాదాంతమైనా, సుఖాంతమైనా, భావగర్భిత ఘట్టమైనా,హాస్యరస భరిత ఘట్టమైనా, ఊహా జగత్తు నిర్మాణమైనా, స్త్రీ పురుష పాత్రపోషణ అయినా షేక్స్పియర్ ఒక్కడే అసమాన ప్రతిభా విశేషంతో రచింపగలిగారు. ప్రతి నాటకానికి విశిష్టత ఉన్నప్పటికీ నాటక రచన సాగిస్తున్నప్పుడు కాలక్రమేణా వివిధ భావాలను ఉద్రేకాలను సమన్వయింపగలిగారు. సామాజికులు కోరినట్లుగా రస సమన్వయాన్ని సాధించిన కళాస్రష్ట షేక్ స్పియర్.

ఆయన రచనల్లో అసమాన శక్తి మనకు కనబడుతుంది. నాలుగున్నర శతాబ్దాలు గడిచినా షేక్స్పియర్ నాటకాలలో ఈ జీవశక్తి క్షీణింపలేదు. చదువుతున్నకొద్దీ ప్రతి నాటకంలోనూ జీవశక్తి పెరుగుతూనే ఉంది. రసాస్వాదన సంతృప్తిని కలిగిస్తుంది. ఎన్నిసార్లు చదివినా విసుగు పుట్టించని ఇన్ని నాటకాలను ఒక్క షేక్స్పియర్ మాత్రమే సృష్టించగలిగాడు. ఆంగ్ల సాహిత్యంలోని అసమాన

**ప్రతిభామూర్తికి నన్నయవాణి అక్షర నీరాజనం.**

# నన్నయలో అధికారుల శ్రమదానం


తుప్పలను తొలగిస్తున్న అధికారులు, విద్యార్థులు

**11.12.21 (మీడియాసెల్)**ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం బాయ్స్ హాస్టల్ సమీపంలోని తుప్పలను విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు తొలగించారు. రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ విద్యార్థులతో కలసి శ్రమదాన కార్యక్రమంలో పాల్గొనే వారిని ప్రోత్సహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రపరచుకుంటూ పర్యావరణ హితంగా జీవించే అలవాటును విద్యార్థులు కలిగి ఉండాలన్నారు. వాతావరణం కారణంగా విశాలమైన ప్రాంగణంలో తుప్పలు పేరుకుపోయాయని వాటిని ఎప్పటికప్పుడు శుభ్రపరుచుకోవాలని తెలియజేసారు. వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని తొప్పలను, వ్యర్థాలను తొలగించేందుకు కార్యాచరణ ప్రారంభించారన్నారు. త్వరలో విశ్వవిద్యాలయం పచ్చని ప్రకృతి ఒడిగా ఆహ్లాదకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ వార్డెన్ డా.బి.జగన్మోహన్ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మానవత్వమే అంబేద్కర్ సిద్ధాంతం


అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

**06.12.21** (మీడియాసెల్) డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ గొప్ప మానవతావాది అని, మానవత్వమే అంబేద్కర్ సిద్ధాంతమని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్లో సోమవారం అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు, విశ్వ విద్యాలయ అధికారులు అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిం చారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఆర్థిక, సామాజిక అడ్డంకులను అధిగమించి తనకెంతో ఇష్టమైన విద్యాభ్యాసం పూర్తిచేసి ఉన్నత ఉద్యో గంలో స్థిరపడిన అంబేద్కర్ వివక్షతకు గురవుతూ వచ్చారన్నారు. అంబేద్కర్ కు ఎన్ని అడ్డంకులు అవాంతరాలు ఎదురైనా తాను నమ్మిన సిద్ధాంతాన్ని, విలువ విడిచి పెట్టలేద న్నారు. అంబేద్కర్ ను ఆదర్శంగా తీసుకొని నేటితరం యువత శ్రమను అధిగమిస్తూ జీవితంలో అభివృద్ధి సాధించాలని, స్వీయ అభివృద్ధితో పాటు సమాజ అభివృద్ధికి కూడా పాటుపడాలన్నారు. సమాజంలోని అందరూ సమానమేనని, వివక్షత లేని సమసమాజ నిర్మాణం కోసం ఆయన పోరాటం చేశారన్నారు. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా జీవిస్తూ రాజ్యాంగ ఫలాలు అందరూ మానవత్వంతో మెలగాలని సూచించారు. విశ్రాంత ప్రిన్సిపాల్ డా.చిలుకోటి కూర్మయ్య మాట్లాడుతూ అంబేద్కర్ భారత రాజ్యాంగం ద్వారా సమాజానికి అందించిన విలువైన ఫలాలను అందరికీ అందించే బాధ్యత యువతపై ఉందన్నారు. అంబేద్కర్ ను ఆదర్శంగా తీసుకొని సమాజాభివృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ విశ్వవిద్యాలయ అధికారులు అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

# నన్నయ విజ్ఞాన భారతి పబ్లికేషన్ పోర్టల్



నన్నయ విజ్ఞానభారతి పబ్లికేషన్ పోర్టల్ ను ప్రారంభిస్తున్న వీసీ

**08.12.21 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఆధ్వర్యంలో "నన్నయ విజ్ఞాన భారతి" పేరుతో పబ్లికేషన్ పోర్టల్ ను వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు బుధవారం ప్రారంభించారు. యూనివర్సిటీ ఈసీ హాల్ లో జరిగిన ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో వీసీ మాట్లాడుతూ శాస్త్ర, సాంకేతిక రంగాలకు సంబంధించిన పుస్తకాలను, జర్నల్స్ ను ప్రచురించేందుకు నన్నయ విజ్ఞాన భారతిని ప్రారంభించామని అన్నారు. నాక్ గుర్తింపులో యూనివర్సిటీకి మంచి గ్రేడ్ సాధించేందుకు అవసరమైన అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. నాక్ లో పబ్లికేషన్ పోర్టల్ కు ప్రత్యేక పాయింట్లు ఉంటాయన్నారు. ఉన్నత విద్యా వ్యవస్థలో అధ్యాపకులకు, పరిశోధకులకు ప్రచురణలు కీలక పాత్రను పోషిస్తాయన్నారు. నాక్ బృందం విశ్వవిద్యాలయాన్ని సందర్శించే నాటికి నన్నయ విజ్ఞాన భారతికి ఐ.ఎస్.ఎస్.ఎన్ నెంబర్ ను తీసుకువచ్చి నాణ్యమైన ప్రచురణలను అందిస్తామన్నారు. తక్కువ ఖర్చుతో విశ్వవిద్యాలయ స్థాయిలో ప్రచురణలు చేసుకునేందుకు నన్నయ విజ్ఞాన భారతి చక్కని ప్లాట్ ఫారం అని అన్నారు. అధ్యాపకులు, పరిశోధకులు, మేధావులు, శాస్త్రవేత్తలు, విద్యావేత్తలందరూ నన్నయ విజ్ఞానభారతి ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఎడిటర్ ఇన్ ఛీఫ్ వీసీ ఆచార్య ఎం.జగన్నాథరావు, ఎడిటోరియల్ బోర్డ్ మెంబర్స్ గా ఆచార్య పి.సురేష్ వర్మ, ఆచార్య వై.శ్రీనివాసరావు, డా.ఎ.మట్టారెడ్డి, డా.కె.రమణేశ్వరి, డా.వి.పెర్సిస్, డా.ఎం.కమలకుమారి, డా.కె.వి.స్వామి, డా.పి.విజయనిర్మల, డా.బి.జగన్మోహనరెడ్డి, డా.పి.వెంకటేశ్వరరావు లు వ్యవహరిస్తారని తెలిపారు. నన్నయ విజ్ఞాన భారతిలో తమ అమూల్యమైన రచనలను ప్రచురించేందుకు editor@aknu.ac.in ద్వారా సంప్రతించాలన్నారు. పబ్లికేషన్ పోర్టల్ ను ఏర్పాటు చేయడానికి సహకరించిన కె.వి.ఆర్.ఎస్.ఎస్.గ్రూప్ వారికి యూనివర్సిటీ సాంకేతిక నిపుణులు ఎం.శ్రీనివాసరావు, బి.బి.అహ్మద్ ఆలీ ను వీసీ అభినందించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



## మంచిమాట

*వ్యక్తిని కొలవాల్సింది అతడు ఎదిగిన ఎత్తుతో కాదు. అతడు ఎదిగిన ఎత్తుకి ఎంత మందిని తనతోపాటు తీసుకెళ్లాడు? ఎంత మందిని ప్రభావితం చేశాడు? ఎంతవరకు తను పనిచేసే వ్యవస్థకు ఉపయోగపడ్డాడు? ఎంతవరకు తను సంపాదించిన దానిలో కొంత సమాజానికి ఖర్చు చేశాడు. అనే అంశాలతో పరిగణించాలి.*

*- ఎమర్సన్*

## జనరల్ బిపిన్ రావత్ (భారత తొలి త్రిదళపతి)



భరతమాత సేవలో తరించిన మేరునగ శిఖరం.ఓ అసమాన సైనికుడు,అసలైన దేశభక్తుడు.వ్యూహాత్మక విషయాలపై ఆయన ఆలోచనలు అసాధారణం.అపార ప్రతిభాశాలి.

భారత సైన్యానికి సేవలందిస్తున్న కుటుంబం నుంచి వచ్చిన ఆయన సైన్యంలో 43 ఏళ్ళు సేవలందించి హెలికాప్టర్ ప్రమాదంలో రావత్, ఆయన సతీమణి శ్రీమతి మధులికతో పాటు మరొక 11 మంది మరణించటం విషాద సంఘటన.
భారతదేశ రక్షణ విభాగానికి వారు అందించిన సేవల్ని స్మరిస్తూ వారికి ఘన నివాళి!!

– నన్నయవాణి

# ఘంటసాల శతజయంతి వత్సరం

## అమరగాయకుడు



భానుమతి గారి ప్రోత్సాహంతో
సహాయ సంగీత దర్శకునిగా
అవకాశాన్ని అందిపుచ్చుకుని
బాలరాజు చిత్రంతో అక్కినేనికి,
షావుకారు చిత్రంలో ఎన్టీఆర్ కి
తొలిసారిగా గాత్రదానం చేసిన
గాత్ర ప్రదాత ఘంటసాల!
కీలుగుర్రం చిత్రానికి మొట్టమొదటి సారిగా
సంగీత దర్శకత్వం వహించారు ఘంటసాల!
ఆనాటి నుంచి కొన్ని వేల సినిమా పాటలు,
పాటలకు వహించిన
ఆయన సంగీత దర్శకత్వం మూడు దశాబ్దాలు
దిగ్విజయంగా సాగింది!
ఆ స్వర ప్రస్థానం నటుడిగా, సంగీత
దర్శకునిగా, గాయకునిగా మెప్పించి
తన బహుముఖ ప్రజ్ఞను చాటుకున్నారు
మన ఘంటసాల!
లలిత గీతాలకు లాలిత్యం అద్ది
పౌరాణిక పద్యాలకు పట్టంకట్టి
పలువురి ప్రశంసలందుకున్నారు.
పుష్ప విలాపం, కుంతీ విలాప గానంతో కరుణ
రసాన్ని ప్రదర్శించి
శ్రోతల హృదయాలను
ద్రవింప చేశారు ఘంటసాల!
ఆయన గానామృతం గావించిన భగవద్గీత
ప్రతి తెలుగింటిని పునీతం చేసింది
ఆయన మధుర గానానికి నిదర్శనమై నిలిచింది!
ఆ గానం ప్రభవించి
శత వసంతంలోకి అడుగిడిన
వత్సరం, భలే మంచిరోజులు,పసందైన రోజులు
అదే నేటి శత వత్సరం రోజులు!
ఆ అమర గాయకునికి అర్పిద్దాం
అక్షర నివాళులు!


– ఆళ్ల నాగేశ్వరరావు, తెనాలి



గుప్త నిధులు కావాలా?
నీలోకి నీవు తవ్వుకో!!

– నూటెంకి రవీంద్ర

# ఆమె ఆశాజీవి !




ఎన్ని నిరాశా వెల్లువలు
నిప్పులై నెత్తిన కుమ్మరించినా
విలువల దరహాసంతో దిగమింగుతోంది.!
ఎన్ని మాటల తూటాలు
తన హృదయాన్ని చిద్రంచేసినా
పరువుతో భారంగా భరిస్తోంది.!
ఎన్ని చూపుల చురకత్తులు
తన తనువును నిలువునా చీల్చినా
మానంతో మౌనంగా రోదిస్తోంది.!
ఎన్ని ఆటుపోట్లు పెల్లుబికి
తన సంసార సాగరాన్ని ముంచెత్తినా
మంద హాసంతో మరిచిపోతోంది.!
ఎన్ని బంధనాల బందీఖానాలు
తనను బంధించినా బాధతో పయనిస్తోంది.!
ఎన్ని హక్కులను కోల్పోయినా బాధ్యతలను
విస్మరించక వెలుగు పంచుతోంది.!
ఎన్ని అవరోధాలు తన భవిష్యత్తు తుంచినా
తలవంచుకుని ఎదుగుతూ ఒదుగుతోంది.!
ఆమె ఆశాజీవిగ తనకు తానే గురువై
నిరాశలోని ఆశకై బంగారు భవితకు
మౌనంగా బాటలు వేసుకుంటోంది..!
తన ఆత్మాభిమానాన్ని గెలుచుకుని
అందరినీ తలెత్తుకునేలా మలుచుకుంటోంది.!
తనకు సాయం చేయకపోయినా
తన సాధనకు అడ్డొచ్చి సాధించకండి!
తనకు చేయూత నివ్వకపోయినా
తన బ్రతుకుని చిద్రం చేయకండి.!
తన హక్కులని కాలరాయకండి..!
తనను ఆశాజీవిగా గెలవనివ్వండి.!

– డా.పసుపులేటి నాగమల్లిక
ప్రభుత్వ డిగ్రీ కళాశాల,
రామచంద్రపురం.

# ఉచిత మెగా వైద్య శిబిరం


వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

**10.12.21 (మీడియాసెల్)** కోరుకొండ మండలం కె.జె.ఆర్. కాలేజ్ ఆఫ్ ఫార్మసీ నందు పోర్టర్ అండ్ ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ సంయుక్త ఆధ్వర్యంలో వరల్డ్ డయాబెటిక్ డే సందర్భంగా మెగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన పార్లమెంట్ సభ్యులు మార్గాని భరత్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ వైద్య శిబిరం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు సేవలందించింది. ఈ శిబిరంలో సాధారణ వైద్యులు మరియు డయాబెటాలజిస్ట్ డాక్టర్ డి. రాజశేఖర్, ఎముకల వైద్య నిపుణులు డాక్టర్ టి. మనోజ్, గైనకాలజిస్ట్ డాక్టర్ పి. అమృత, కంటి వైద్యులు డాక్టర్ ఎన్.జి.ఎస్. శ్రీనివాసరావు, దంత వైద్యులు డాక్టర్ పి. ప్రణయ్ కుమార్, డాక్టర్ టి.వి.నారాయణరావు వంటి వైద్య నిపుణులు హాజరై సుమారు 400 మందికి ఉచిత వైద్య సేవలను అందించారు. ఈ కార్యక్రమంలో పోర్టర్ ప్రెసిడెంట్ బి.గాంధీ, కె. జె. ఆర్. కాలేజ్ ప్రిన్సిపాల్ ఆచార్య బట్టు గంగారావు, నన్నయ ఫార్మసీ కాలేజ్ కోర్సు కోఆర్డినేటర్ డాక్టర్ బట్టు హీరా, సహాయక ఆచార్యులు డాక్టర్ ఎల్. సురేంద్రబాబు, కృష్ణంరాజు, అన్వర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

## అమర్ రహే బిపిన్ రావత్

మన సైన్యం వ్యూహరచనా నిపుణుడు
మన జనరల్ బిపిన్ రావత్
ఆ మహనీయుని కోల్పోయి
విలపిస్తున్నది మన భారత్ !
పాకిస్తాన్ సర్జికల్ స్ట్రైక్ విజయుడు
మయన్మార్ ను ఢీకొన్న అజేయుడు
సైన్యంలో పలుసంస్కరణలకు ఆద్యుడు
సైనిక హృదయ చికిత్సా వైద్యుడు !
భారత ఆర్మీ చీఫ్ గా ఎన్నికైనవాడు
భారత సైన్యంలో మణిపూసగ వెలిగాడు
థియేటరైజేషన్ ప్రణాళిక ఆద్యుడు




థియరీ సైన్యఎమోషన్ పెంచిన రుద్రుడు!
మన దేశం జనరల్ బిపిన్ రావత్
మార్చి 16న 1958 జన్మించాడు
డిసెంబర్ 8న 2021 పరమపదించాడు!
ప్రాణాలను లెక్క చేయక దేశం కోసం
నిర్విరామ కృషిసల్పిన సాహస వీరుడు
త్రివిధ దళాలకు ఆధిపత్యం వహించిన ధీరుడు
ఐ.రా.స శాంతి దళాలకు ఆయన అధ్యక్షుడు
ఉగ్రవాద దళాలను ధ్వంసం చేసిన దక్షుడు
త్రిదళం సైనిక స్థావరాల బలాల రక్షకుడు
వారిలో ఆత్మస్థైర్యాన్ని పెంచిన శిక్షకుడు!
భరతమాత ముద్దుబిడ్డ ఇకలేడు
భారతావనిలో ఇక మనకు కానరాడు
వెలిగి వెళ్ళిపోయెను అమరపురికి
మిగిలి పోయెను అమరుడై మన మదికి !

– గుర్రాల లక్ష్మారెడ్డి, కల్వకుర్తి.

ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్ :- nannayavani@aknu.edu.in